సాక్షి
వికారాబాద్
గురువారం । 26 । డిసెంబర్ । 2024



ధరలు పెరిగి..

గుడ్డు ధర రోజురోజుకూ ఆకాశాన్నంటుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భారంగా మారింది. 8లో▸



అనంతగిరి: ఏసుప్రభు పాటలు ఆలపిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు



దుద్యాల్: ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుద్యాల్ పోలీస్ స్టేషన్

కొడంగల్: నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ చేయనున్నారు. జిల్లా అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కొడంగల్‌లో బీసీ గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులకు భూమి పూజ, దుద్యాల్ మండలంలో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయానికి శంకుస్థాపన, తాత్కాలిక భవనంలో దుద్యాల్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం, హకీంపేటలో జూనియర్ కళాశాల, హైస్కూల్ భవన నిర్మాణానికి భూమి పూజ, హకీంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం, కోస్గిలో అండర్ 19 నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు.

డాలర్స్ హిల్స్‌లో కొండచిలువ కలకలం



ప్రహరీ లోపలికి వచ్చిన కొండ చిలువ

మణికొండ: నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి ప్రహరీలోకి కొండ చిలువ రావటంతో కార్మికులు భయాంకు గురయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్స్‌హిల్స్ కాలనీలో డాక్టర్ అవినాష్ నూతన ఇంటి నిర్మాణం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 అడుగుల కొండ చిలువ ప్రహరీ గోడ లోపలికి వచ్చింది. ఓ మూలన ఉన్న డస్ట్ బిన్ పక్కన చేరి బుసలు కొట్టింది. అటుగా వెళ్లిన వారు దాన్ని గమనించి యజమానికి తెలిపారు. దీంతో ఆయన స్నేక్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి సంచిలో దానిని బంధించారు. కొండచిలువను జూపార్క్‌లో అప్పగిస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని



ఫాతిమాను అభినందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలో ఉన్న వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని హుదా ఫాతిమా జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే యాదయ్యను స్కూల్ యాజమాన్యం, విద్యార్థిని తల్లిదండ్రులు మార్యదపూర్వకంగా కలిశారు. ఆరో తరగతి చదువుతున్న హుదా ఫాతిమా ఇటీవల శంషాబాద్‌లో జరిగిన జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కర్రె శివప్రసాద్, మాజీ సర్పంచ్ జహంగీర్, విద్యార్థిని తల్లిదండ్రులు పాషా తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్ : పట్టణంలోని మెథడిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండుగను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వికారాబాద్‌లోని మెథడిస్టు చర్చిలో జరిగిన వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఏసు నామస్మరణ, భక్తి గీతాలతో చర్చిలు మార్మోగాయి.



అనంతగిరి: వికారాబాద్‌లోని మెథడిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

తగ్గేదేలే..!



సిటీ శివారులో న్యూ ఇయర్ పార్టీలకు ఏర్పాట్లు

- బుకింగ్ పూర్తయిన ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు
- ఈవెంట్ల నిర్వహణకు మూడు దరఖాస్తులే
- అనుమతి లేకుంటే చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

మొయినాబాద్: పాత సంవత్సరానికి వీడ్కోలు.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించేందుకు నగర శివారుల్లోని ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో ఈవెంట్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎలాంటి వేడుకలు, ఈవెంట్స్ నిర్వహించినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

లిక్కర్‌కు ఎక్సైజ్.. డీజేకు పోలీసుల అనుమతి

హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో వందల సంఖ్యలో ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని వీవీఐపీలు, రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులవి ఉన్నాయి. మరి కొన్ని ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లను ఈవెంట్లు, వేడుకలు నిర్వహించేందుకు అద్దెకు ఇస్తున్నారు. వీవీఐపీలు, ప్రముఖుల ఫాంహౌస్‌లలో వారి కుటుంబ సభ్యులే న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకునే అవకాశం ఉంది. అద్దెకు ఇచ్చే ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌ల్లో న్యూ ఇయర్ వేడుకలు, ఈవెంట్స్‌ను నిర్వాహకులు చేపట్టనున్నారు. వాటికి తప్పనిసరిగా పోలీసులు నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వేడుకల్లో లిక్కర్ వాడితే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. డీజే వాడితే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నిబంధనలు బేఖాతరు

చాలా వరకు ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌ల్లో నిర్వహించే ఈవెంట్స్, వేడుకలకు అనుమతులు తీసుకోకుండా, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లపై దాడులు చేసి అనుమతి లేకుండా నిర్వహించే ఈవెంట్లు, వేడుకలను భగ్నం చేస్తున్నారు. అయినా ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌ల నిర్వాహకులు భయపడటంలేదు. మామూళ్లకు అలవాటు పడిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

బుకింగ్‌లు పూర్తి

డిసెంబర్ 31న రాత్రి నిర్వహించే న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క ఫాంహౌస్ నిర్వాహకుడు కూడా అనుమతి తీసుకోలేదు. వేడుకలకు ఐదు రోజుల సమయమే ఉన్నా ఇప్పటి వరకు అనుమతులకోసం దరఖాస్తులు చేయడంలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహస్‌లు ఉన్నాయి. వీటిలో సుమారు 600 ఫాంహౌస్‌లను వేడుకలు, ఈవెంట్లకు అద్దెకు ఇస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలకోసం ఈ ఫాంహౌస్‌లు అన్ని బుక్ అయినా పోలీసుల అనుమతి తీసుకోకపోవడం గమనార్హం.

అనుమతులు తప్పనిసరి



న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే రిసార్ట్స్, ఫాంహౌస్‌లు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ముందే చెప్పాం. ఇప్పటి వరకు మూడు రిసార్ట్స్ యజమానులు ఈవెంట్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఫాంహౌస్‌ల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అనుమతి లేకుండా వేడుకలు, ఈవెంట్స్ నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

భక్తిశ్రద్ధలతో బోనాలు

- బోనమెత్తిన జోగిని శ్యామల

నవాబుపేట: మండలంలోని నారెగూడ గ్రామంలో మూడు రోజులుగా మైసమ్మ, ఈదమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం జోగిని శ్యామల బోనం ఎత్తుకొని హనుమాన్ మందిరం నుంచి మైసమ్మ ఆలయం వరకు ఆటపాటలతో అలరించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు పూనకాలతో గ్రామం మార్మోగింది. వేడుకల్లో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జ్ భీమ్ భరత్, ఆలయ నిర్మాణ దాతలు రఘునందన్ రెడ్డి, చంద్రారెడ్డి, మాజీ సర్పంచులు పర్మయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: నాగారంలో తుల్జా భవానీ మాత ఉత్సవాల్లో బోనమెత్తిన చిన్నారి



నారెగూడలో బోనమెత్తుకొని పూజలు చేస్తున్న జోగిని శ్యామల

దేశ సమైక్యతకు నిరంతర కృషి



ఎన్నికైన బజరంగ్‌దళ్ నూతన కార్యవర్గం సభ్యులు

చేవెళ్ల: దేశ సమైక్యత కోసం నిరంతరం పాటుపడుతున్న సంస్థ బజరంగ్‌దళ్ అని పాలమూరు విభాగ్ సంయోజక్ గూడెం రమేశ్ అన్నారు. బుధవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ జిల్లా శిక్షణవర్గ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ జిల్లా నాయకులు చేవెళ్ల బజరంగ్‌దళ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల బజరంగ్‌దళ్ సంయోజక్‌గా డి.అనిల్‌కుమార్‌ముదిరాజ్, సహ సంయోజక్‌గా గణేశ్, అనిల్, గోరక్ష సంయోజక్‌గా మల్లేశ్, ధర్మప్రసార్‌గా రాఘవేంద్రచారి, విద్యార్థి సంయోజక్‌గా విశ్వేశ్వర్‌లను నియమించినట్లు ప్రకటించారు. జిల్లా ధర్మప్రసాద్ చిలుకూరి శ్రీనివాస్, బజరంగ్‌దళ్ కార్యకర్త ధనుష్‌రెడ్డి, సందీప్, నవీన్, వెంకటేశ్, శివకుమార్, వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షులు జగదీశ్వర్, అధికార ప్రతినిధి శశిధర్, భిక్షమయ్య, ప్రశాంత్, శ్రీలత పాల్గొన్నారు.



శంకర్‌పల్లి చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు

దూరదృష్టి కలిగిన నేత.. వాజ్‌పేయి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: దూరదృష్టి కలిగిన అతికొద్ది మంది నేతల్లో అగ్రగణ్యుడు అటల్ బిహారి వాజ్‌పేయి అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శంకర్‌పల్లి చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వాజ్‌పేయి దూరదృష్టి కారణంగానే భారతదేశం ప్రస్తుతం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, మండల అధ్యక్షుడు రాములు, మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, వెంకటేశ్, బయన్న, నర్సింహారెడ్డి, వీరేందర్, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలుచర్చిలకు వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ మత్స్యకార సహకార సంఘం చైర్మన్‌గా మెట్టు సాయికుమార్‌ను ప్రభుత్వం నియమించడంపై కుతుద్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకార సంఘాల సమైక్య చైర్మన్‌గా పిట్టల రవీందర్‌ముదిరాజ్‌ను నియమించినప్పుడు ఎవరైనా విమర్శలు చేశారా అని ప్రశ్నించారు.

మిగిలింది 32 రోజులే..!

- జనవరి 26తో ముగియనున్న కౌన్సిల్ పదవీ కాలం
- జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు.. 97 మంది కౌన్సిలర్లు



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: చైర్మన్ సాబ్ మా వార్డులో సమస్యలను పరిష్కరించండి.. కౌన్సిల్ సాబ్ మా వీధిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. వేయించండి.. అంటూ ఉదయం లేచింది మొదలు వార్డు ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్,కౌన్సిలర్లకు విన్నపాలు వినిపిస్తారు. అయితే ఈ విన్నపాలు వినే అవకాశం వారికి మరో 32 రోజులు మాత్రమే ఉంది. పాలకవర్గం గడువు వచ్చే ఏడాది జనవరి 26తో ముగియనుంది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు సామాన్య ప్రజలుగా మారనున్నారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా 97 మంది కౌన్సిలర్లు ఉన్నారు. తాండూరు మున్సిపాలిటీలో మాత్రం అనుకున్నంత మేర అభివృద్ధి చేయలేకపోయామనే ఆందోళన కౌన్సిలర్లలో వ్యక్తమవుతోంది.

నామమాత్రంగా అభివృద్ధి

తాండూరు మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు 2020 జనవరి నెలలో ఎన్నికలు జరిగాయి. కోవిడ్ నేపథ్యంలో ఏడాది పాటు పాలన కుంటుపడింది. ఐదేళ్లపాటు పదవిలో కొనసాగిన కౌన్సిలర్లు వారివారి వార్డుల్లో పెద్దగా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు. ఒకరిద్దరు మినహా మిగతా వారంతా ఆశించిన మేర పనులు చేయలేకపోయారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోయారు. కమిషనర్ లేకపోవడంతో ఆర్డీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో అభివృద్ధి కుంటుపడిందని చెప్పవచ్చు.

వర్గపోరుతో..

మరోవైపు అధికార పార్టీలో వర్గపోరు కారణంగా కౌన్సిల్ సమావేశాలు జరగలేదు. బీఆర్‌ఎస్ పార్టీ మెజార్టీ స్థానాలు సాధించి చైర్‌పర్సన్ సీటును దక్కించుకుంది. అప్పట్లు చైర్‌పర్సన్ పదవి కోసం బీఆర్‌ఎస్ నుంచి తాటికొండ స్వప్న, పట్లోళ్ల దీప పోటీ పడ్డారు. ఎన్నికల సమయంలో తామే చైర్‌పర్సన్ అంటూ ఇద్దరూ ప్రచారం చేశారు. అనూహ్యంగా ఇరువురూ విజయం సాధించారు. మున్సిపల్ ఎన్నికలతో బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, నాటి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మధ్య వర్గపోరు సాగింది. పట్నం వర్గం నుంచి చైర్‌పర్సన్ రేసులో స్వప్న.. పైలెట్ వర్గం నుంచి దీప పోటీ పడ్డారు. దీంతో అధిష్ఠానం పెద్దలు రంగంలోకి దిగి పట్నం వర్గానికి చెందిన తాటికొండ స్వప్నకు చైర్‌పర్సన్‌గా రెండున్నరేళ్ల పాటు కొనసాగించేందుకు అవకాశం కల్పించారు. పైలెట్ వర్గానికి చెందిన పట్లోళ్ల దీపను వైస్ చైర్‌పర్సన్‌గా నియమించారు. తదనంతర కాలంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల మధ్య విభేదాలు తలెత్తి తారాస్థాయికి చేరాయి. దీంతో పట్నం వర్సెస్.. పైలెట్‌గా మారింది. దీంతో మున్సిపల్ కార్యాయంలో ఏ పని చేపట్టినా రెండు వర్గాలు విభేదించడం మొదలు పెట్టాయి. మరోవైపు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉన్న ఆర్డీఓ వర్గపోరుకు మరింత ఆజ్యం పోశారనే ఆరోపణలు వచ్చాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు వర్గపోరు కొనసాగుతూ వచ్చింది. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బుయ్యని మనోహర్‌రెడ్డి విజయం సాధించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత మున్సిపల్ వ్యవస్థ గాడిలో పాడింది..

ఏడాదిగా అభివృద్ధి పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాండూరు మున్సిపాలిటీలో వర్గపోరు ఆగిపోయింది. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌కు పూర్తిగా అధికారాలు ఇవ్వడంతో కౌన్సిలర్ సమవేశాలు ప్రశాంతంగా జరిగాయి. కౌన్సిల్‌లో అభివృద్ధి పనులకు పెట్టిన ఎజెండాలో సభ్యులు ఆమోదం పొందుతు వచ్చాయి. దీంతో రూ.కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

నీటి బిల్లు.. గుండె గుభేల్

పేదలకు పెను భారం

- ఒక్కో ఇంటిపై రూ.18వేల నుంచి రూ.20వేల వరకు బకాయిలు
- మాజీ మంత్రి సబితారెడ్డిని ఆశ్రయించిన గాంధీనగర్ వాసులు
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ

బడంగ్‌పేట్: ముప్పై ఏళ్ల క్రితం ఉపాధి వెతుక్కుంటూ పొట్ట చేతబట్టుకుని పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి బడంగ్‌పేట్‌కు వలస వచ్చారు. మహాత్మా గాంధీజీ పేరుపెట్టుకుని గుడిసెలు వేసుకుని పొట్ట కూటికి ప్రయాణం సాగించారు. అప్పట్లో గుడిసెలు కూల్చివేయడంతో ధర్నాలు, పోరాటాలు చేస్తూ గూడు కల్పించాలని ఆయా ప్రభుత్వాలను వేడుకోగా చలించిన నాటి ప్రభుత్వాలు ఇళ్లలేని పేద కుటుంబాలను గుర్తించి హుడా లేవుట్ చేసి ప్రతీ కుటుంబానికి 60 గజాల చొప్పున ఇంటి జాగలను లీగల్‌గా కేటాయించి సర్టిఫికెట్లను అందచేసింది. ఇప్పుడు గుడిసెల స్థానంలో రేకులు ఉన్నాయి. కానీ వీరికి హెచ్‌ఎండీఏ మెట్రో వాటర్ వారు నీటి బిల్లులు వేయడంతో ఆ బిల్లులు భారంగా మారాయి.

అప్‌గ్రేడ్ అయ్యాక అదనపు భారం

బడంగ్‌పేట కార్పొరేషన్ ఏర్పాటుకు ముందు 2013 వరకు బడంగ్‌పేట గ్రామ పంచాయతీ కొనసాగుతూ ఉండేది. అందులో గాంధీనగర్ ఒక స్లమ్ ఏరియా. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యాక తాగునీటి సరఫరా బాధ్యత హెచ్‌ఎండీఏకు (మెట్రోవాటర్)కు అప్పగించారు. దీంతో బిల్లుల మోత మోగుతోంది. ఒక్కో ఇంటికి ఇప్పటి వరకు రూ.18 వేల నుంచి 20 వేల వరకు బిల్లులు రావడంతో గాంధీనగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ 800కు పైగా ఉన్న నివాసాలకు



సుమారు రూ.1.50 కోట్లకు పైగా మెట్రో వాటర్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. దీంతో మెట్రో వాటర్ అధికారులు, సిబ్బంది నుంచి ఒత్తిడి పెరగడంతో వారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆశ్రయించారు. పాత మెట్రో బిల్లులు మాఫీ చేసేలా చూస్తే కొత్తగా వచ్చే బిల్లులు తగ్గిస్తే ప్రతీ నెల చెల్లించుకుంటామని ఇటీవల ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన సబితారెడ్డి మెట్రో ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పాత నల్లా బిల్లులు మాఫీ చేసి న్యాయం చేసేలా చూస్తానని గాంధీనగర్ వాసులకు హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా రైతు మృతి


సిద్ధప్ప (ఫైల్)

తాండూరు రూరల్: వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిట్టబాసుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్ధప్ప(52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 21న ఆయన తన సోదరి వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో అందరూ అక్కడికే వెళ్లాడని భావించారు. కానీ బుధవారం తన పొలంలో సిద్ధప్ప అనుమానాస్పదంగా పడి ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అలాగే కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించగా ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య అడివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే సిద్ధప్ప మద్యం తాగేవాడని.. గతంలో చాలాసార్లు ఇంటి నుంచి వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మద్యం తాగి చలిలో పొలం వద్దనే గుండెపోటుతో మృతి చెందాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


ఎన్కెపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ అరవింద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి సైబర్ నేరాలపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ అరవింద్ మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతాల నుంచి అనధికారికంగా నగదు బదిలీ, తస్కరణకు గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకర్లు మీ డబ్బులు విత్‌డ్రా కాకుండా నిలుపుదల చేస్తారన్నారు. స్మార్ట్ ఫోన్‌లలో వచ్చే లింకులు, ఓటీపీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్రవాహనం నడిపించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మేఘమాల, విజయ, నాయకులు చంద్రయ్య, మల్లయ్య, బాబుమియ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

బండ్లగూడ: వ్యక్తిగత... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు ప్రబలకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిల వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... క్రిస్మస్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, తౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

ముషీరాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ లెక్చరర్స్ సంఘం సమావేశం అధ్యక్షులు కె.సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ ప్రమోషన్లల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న మాదిరిగానే బీసీలకు కూడా ఎట్రాసిటీ ప్రొటెక్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ధరలు పెరిగి.. గుడ్డు కరువై

ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే చిన్నారులకు పోషకాహారం అందని ద్రాక్షలా మారుతుంది. కీలకమైన కోడి గుడ్డు ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. ఫలితంగా మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్డు అందడం లేదు.

- విద్యార్థులకు పోషకాహారం దూరం
- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అధికమైన ఆర్థిక ఇబ్బందులు


విద్యార్థులకు రాగి జావ పోస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

దౌల్తాబాద్: గుడ్డు ధర రోజురోజుకూ ఆకాశాన్నంటుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భారంగా మారింది. సోమ, బుధ, శుక్రవారాల్లో తప్పనిసరిగా విద్యార్థులకు గుడ్డు అందించాలి. కానీ వాటి ధర పెరగడంతో చాలా బడుల్లో వారంలో ఒకటి, రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు పోషకాహారం దూరం అవుతుంది. దీనికి తోడు నిర్వాహకులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పోషకాహారం లభించాలనే ఉద్దేశంతో సర్కారు మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఇస్తుంది. ఇందుకు ఒక్కో దానికి రూ.5 చెల్లిస్తుంది. కానీ ప్రస్తుతం మార్కెట్లో ఒక్కోటి రూ.7 ఉండడంతో నిర్వాహకులకు భారంగా మారింది. గుడ్డు ఇవ్వకపోతే విద్యాశాఖ అధికారులతో ఇబ్బంది ఉంది. పెడితే ఆర్థిక భారంతో ఇబ్బందులు తప్పవని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో వివరాలు	
ఉన్నత పాఠశాలలు	5
ప్రాథమికోన్నత	8
ప్రాథమిక	29
మొత్తం విద్యార్థులు	3,256

నెలలో 12 సార్లు

మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు సార్లు, నెలలో 12 సార్లు గుడ్లు ఇవ్వాలి. ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో ఒక్కొక్కరిపై అదనంగా నెలకు రూ.24 భారం పడుతుందని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఈ భారం భరించలేక కొన్ని పాఠశాలల్లో గుడ్డుకు బదులుగా రాగిజావ ఇస్తున్నారు. నష్టపోయినా సరే అంటూ కొన్ని బడుల్లో పెడుతున్నారు. కొన్నిచోట్ల చేతులెత్తేస్తున్నారు. దీనికి తోడు బిల్లులు చాలా రోజుల నుంచి రావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

ఐదు నెలల్లో అమాంతం

ఐదు నెలల్లో గుడ్డు ధర అమాంతం పెరిగింది. గతంలో ఎప్పుడూ కూడా ఇంత పెరిగిన సందర్భాలు లేవు. ఆగస్టులో రూ.5.70 ఉంటే ప్రస్తుతం రూ.7కు చేరింది. రానున్న రోజుల్లో ఇంకా ఎంత పెరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



ప్రభుత్వం చెల్లిస్తున్న మెనూ చార్జీలు ప్రస్తుత ధరలకు సరిపోవడంలేదు. కూరగాయలు, గుడ్ల ధరలు పెరుగుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఒక్కో గుడ్డుపై అదనంగా రూ.2 భరిస్తున్నాం. గుడ్డు ధర పెరగడంతో ప్రభుత్వం కూడా పెంచి తమకు బిల్లులు పెంచి అందించాలి.

– సావిత్రమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, నర్సాపూర్

ఉన్నతాధికారులకు వివరించాం



గుడ్డు ధర పెరగడంతో వంట నిర్వాహకులకు పడుతున్న భారం గురించి ఉన్నతాధికారులకు వివరించాం. ప్రతి పాఠశాలలో వారంలో మూడు సార్లు విధిగా అందించాలి. అలాగే మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి. త్వరలోనే ఈ సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

అక్రమ కేసులు ఎత్తి వేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్
- 30న హకీంపేట్‌లో సభ


రోటిబండ తండాలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

దుద్యాల్: లగచర్ల ఘటనలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని రోటిబండ తండా, పులచర్లకుంట తండాలో ఇంటింటికి తిరుగుతూ ఈ నెల 30న హకీంపేట్‌లో నిర్వహించే సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ భూముల కోసం పోరాటాలు చేస్తుంటే రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన చేసి ఎలాంటి షరతులు లేకుండా కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వాడకు కూడా భూములను ప్రజల అంగీకారం లేకుండా తీసుకోవద్దన్నారు. 30న హకీంపేట్‌లో భారీ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్ రాములు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. మండల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జల్సాలకు మరిగి.. చోరీలు చేసి


పట్టుబడిన నిందితులు

పట్టుబడిన ట్రాన్స్‌ఫార్మర్ తీగల చోరులు

మహేశ్వరం: కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లలను చోరీ చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన రోహింగ్యాలు హమీద్ హుస్సేన్, నూర్ అలాం, షఫీ అలాం, మహ్మద్ షఫీ, మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ ఫరూఖ్ అలీలు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 14న శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామ సమీపంలో ఉన్న స్టెర్లింగ్ వెంచర్‌లో ఉన్న 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో నుంచి రాగి తీగలను దొంగిలించారు. మరుసటి రోజు సెక్యూరిటీగార్డులు గమనించి వెంచర్ యజమానికి సమాచారం అందించడంతో మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మొదట ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలను పరిశీలించి మయన్మార్ దేశానికి చెందిన ఆరుగురు దొంగతనం చేసినట్లు గుర్తించారు. అనంతరం వారిని అరెస్టు చేసి రూ.4.31 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ లేనందున ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ మండల ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కాలే రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం బస్‌స్టాప్ రోడ్డులో సుమారు 50 మంది కార్మికులు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ పెరిగినందున అక్కడ ఆటోలు ఆపడం ఇబ్బందిగా మారిందన్నారు. చౌరస్తాలోని పిల్లర్ నెంబర్లు 319–320ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కొందరు ద్విచక్ర వాహనాలను ఆపి వెళ్లిపోతున్నారన్నారు. ఆ స్థలంలో ఆటోలు పార్క్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అయితే ఇందుకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించి షరతులతో కూడిన అనుమతి ఇచ్చారన్నారు. ఒకవేళ రాబోయే రోజుల్లో ఆ ప్రాంతంలో గ్రీనరీ లేదా రోడ్డు డెవలప్‌మెంట్ అయితే ఆటోల అడ్డాను పక్కకు జరపాల్సి ఉంటుందని సూచించారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన మున్సిపల్ కమిషనర్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అడ్డాను రెండు పిల్లర్ల మధ్యలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సీఐటీయూ ఆరాంఘర్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భైకుల దొంగ ఆటకట్టు

- ప్రభుత్వ ఆస్పత్రులే టార్గెట్‌గా చోరీలు
- 9 భైకులు స్వాధీనం
- చోరీ భైకుల కొనుగోలుదారులూ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, విడిభాగాలతో పోలీస్ అధికారులు, సిబ్బంది

చిలకలగూడ: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులను టార్గెట్ చేసుకుని ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడు, దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేస్తున్న ముగ్గురు రిసీవర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లతో కలిసి చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి బుధవారం వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా తీగలకుంట దక్కన్ బేకరీ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీర్ అలియాస్ మహ్మద్‌హాషమ్ ఉరఫ్ షేక్ హాసమ్(28) వృత్తిరీత్యా ఏసీ మెకానిక్. అఫ్జల్‌గంజ్‌లోని పెట్రోల్ పంప్‌లో కొన్నాళ్లు పనిచేసి తర్వాత ఏసీ మెకానిక్‌గా పనిలో చేరాడు. మద్యం, గంజాయిలకు బానిసైన సమీర్ విలాసవంతమైన జీవితం గడిపేందుకు సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి విక్రయిస్తున్నాడు.

తల్లిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి...

అస్వస్థతకు గురైన తల్లిని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించిన నిందితుడు సమీర్ కొన్ని రోజులు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రుల పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదని గమనించాడు. రోజుల తరబడి పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి మారు తాళాలతో వాటిని చోరీ చేయడం ప్రారంభించాడు. ఉస్మానియా, గాంధీ, ప్రభుత్వ యునానీ ఆస్పత్రుల్లో పార్కింగ్ చేసిన మొత్తం 9 వాహనాలను చోరీ చేసి, ముషీరాబాద్‌లోని స్క్రాప్ వ్యాపారులకు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన చిలకలగూడ పోలీసులు ఆస్పత్రుల సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుని అటకట్టించారు. ఉస్మానియాలో 4, గాంధీలో 4, యునానీ ఆస్పత్రిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. సమీర్‌తోపాటు చోరీ వాహనాలను కొనుగోలు చేసిన ముషీరాబాద్ స్క్రాప్ వ్యాపారులు మహ్మద్ యూసఫుద్దీన్ అలియాస్ లడ్డు, మహ్మద్ మొయిజుద్దీన్, మహ్మద్ ఖాజాహుస్సేన్‌లను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, విడిభాగాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

గచ్చిబౌలి: ఈ నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి..చికిత్స పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న బుధవారం తెలిపిన వివరాల మేరకు..ఈ నెల 23న రాత్రి 1.50 గంటకు నానక్‌రాంగూడ రోటరీ నుంచి సర్వీస్ రోడ్‌లో నార్సింగి వైపు బైకుపైలో యువకుడు స్నేహితురాలితో కలిసి వెళ్తుండగా వెనుకనుంచి స్కోడా కారు ఢీకొట్టిన విషయం విదితమే. ఈ ఘటనలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని శివాని అదే రోజు మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన వెంకటరమణారెడ్డి (26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన వెంకటరమణారెడ్డి తన స్నేహితురాలైన శివానిని హాస్టల్‌లో డ్రాప్ చేసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య ఇద్దరికి చేరింది. నిందితుడైన కాలేష్ (29)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఓవర్ లోడ్'కు చెక్!


కిష్టాపూర్‌లో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు (ఫైల్)

- కిష్టాపూర్ సమీపంలో మరో సబ్‌స్టేషన్
- స్థల సేకరణ పూర్తి చేసిన అధికారులు
- టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభం

ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో	
కనెక్షన్ వివరాలు	వినియోగదారులు
గృహ విద్యుత్	9,100
వ్యవసాయ విద్యుత్	5,281
ఇండస్ట్రియల్	64

దోమ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు. మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయి. ఓవర్ లోడ్‌తో ఏమైనా సమస్యలు వస్తే పనుల్లో జాప్యం జరిగేది. ఈ సమస్యను అధిగమించేందుకు కొత్తగా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడమే మార్గమని ప్రభుత్వానికి నివేదికలు పంపగా కిష్టాపూర్ సమీపంలో ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విద్యుత్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు స్థలసేకరణ పూర్తి చేశారు.

యాసంగిలో పెరుగుతున్న వినియోగం

మండల పరిధిలో 36 గ్రామ పంచాయతీలకు ఐదు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. గుండాల, దిర్సంపల్లి, దోమ, శివారెడ్డిపల్లితో పాటు మోత్కూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. యాసంగిలో పంట పొలాలకు నీరు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ మోటార్ల వినియోగం పెరుగుతుంది. ఆ సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తడంతో రైతులు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే మరో సబ్‌స్టేషన్ అనివార్యమని అధికారులు నిర్ణయించి కిష్టాపూర్ సమీపంలో స్థలాన్ని ఎంపిక చేశారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

కిష్టాపూర్ సమీపంలో నూతన నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటైతే సమీప రైతులు, గృహవినియోగదారులకు విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోకి దోమ మండలంలో కిష్టాపూర్, బుద్లాపూర్, బ్రాహ్మణపల్లి, పెద్దతండాతో పాటు పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామాలు రానున్నాయి. ఈ గ్రామాల పరిధిలో 2100 గృహ కనెక్షలు, 450 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. దిర్సంపల్లి సబ్‌స్టేషన్ నుంచి కిష్టాపూర్ సబ్‌స్టేషన్ ఈ గ్రామాలు వస్తుండడంతో విద్యుత్ భారం మరింత తగ్గనున్నాయని అధికారులు చెబుతున్నారు. సమీప రైతులకు, గృహవినియోగదారులకు నూతన సబ్‌స్టేషన్‌తో ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. అటు సబ్‌స్టేషన్ వస్తుండడం పట్ల పరిసర ప్రాంత రైతులు, గృహవినియోగదారులు సైతం సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పంటకు నీరు అందేది కాదు



దిర్సంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యల కారణంగా ఇబ్బందులు పడ్డాం. యాసంగి సీజన్‌లో సమస్యలు తీవ్రంగా ఉంటాయి. పొలాలకు నీరు అందేది కాదు. అధికారులు కిష్టాపూర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షనీయం. త్వరితగతిన పనులు పూర్తి చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

– నర్సప్ప, బుద్లాపూర్

ఐదు గ్రామాలకు మేలు



కిష్టాపూర్ గ్రామంలో 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తయింది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాలుంటాయి. దీంతో సమీప గృహాల ప్రజలకు, రైతులకు మేలు చేకూరుతుంది. టెండర్ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఇది పూర్తయిన వెంటనే పనులు వేగిరం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వినయ్‌కాంత్, విద్యుత్ ఏఈ, దోమ

అదుపు తప్పి.. విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్ ప్రధాన రోడ్డులోని పోచమ్మ ఆలయం సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. భెల్ చౌరస్తా నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఈ కారు (ఏపీ 28 సీకె 5379) డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి ఎలక్ట్రికల్ , నెట్ కేబుల్ స్తంభాలను ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అలాగే విద్యుత్ స్తంభం ధ్వంసమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ విభాగం అధికారులు వెంటనే స్పందించి సరఫరా నిలిపివేసి..మరమ్మతు పనులు చేపట్టి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


కారు ఢీకొట్టడంతో కూలిన విద్యుత్, కేబుల్ స్తంభాలు

సమాజంలో అసమానతలు నశించాలి


కొడంగల్ రూరల్: మనుస్మృతిని తగులబెడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప

కొడంగల్ రూరల్: సమాజంలో బడుగు బలహీన వర్గాలను కుల వ్యవస్థతో విచ్ఛిన్నం చేసే మనుస్మృతి గ్రంథాన్ని మంట కలపాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.చంద్రప్ప, పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మనుస్మృతిని తగలబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్ణ వ్యవస్థలో మహిళలు, దళితులకు కనీస హక్కులను నిరాకరించారన్నారు. అసమానతలను సృష్టించిన మనుస్మృతిని ప్రతీ గ్రామంలో దహనం చేయాలన్నారు. సమాజంలో అంతరాలు నశించాలన్నారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ బొంరాస్‌పేట అధ్యక్షుడు అంజిలప్ప, ఉపాధ్యక్షుడు బలరాం, మండల కార్యదర్శి అంజి, నాయకులు అంజి, మహేష్, రమేష్‌బాబు, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి దహనం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరులో కుల నిర్మూలన పోరాట సమితీ (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘాలను కలుపుకొని మనుస్మృతిని మంటలతో తగలబెట్టారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో కేఎన్‌పీఎస్ మండలాధ్యక్షుడు అంజిలప్ప ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

వర్ణవ్యవస్థను వ్యతిరేకించాలి

తాండూరు టౌన్: మనుస్మృతి సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థను వ్యతిరేకించాలని పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మనుస్మృతి పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వర్ణవ్యవస్థ పేరుతో మనువు మానవులను విభజించాడన్నారు. శ్రమను వేరు చేయకుండా శ్రామికులను వేరు చేసి, ఉన్నత, నిమ్న వర్గాలని ప్రాచుర్యంలోకి తెచ్చాడన్నారు. 1927 డిసెంబర్ 25వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుస్మృతి పత్రాలను బహిరంగంగా తగలబెట్టారన్నారు. బడుగు బలహీన వర్గాలు ఈ గ్రంథాన్ని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, నాయకులు శ్రీనివాస్, అంజిలప్ప, బలరాం, అంజి, పకీరప్ప, అశోక్, అమృతయ్య, శాంసన్, విజయేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.